# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# చెయ్యికి ఓటేస్తే రైతుల బతుకు చీకట్లే

జగిత్యాల, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. సరిపడా కరెంట్ లేక, అస్తవ్యస్తమైన భూ రికార్డులతో ఆగమయ్యారు. పాసుబుక్కుల్లో భూములు తారుమారు కావడంతో తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నది. భూముల భద్రతకు పటిష్టమైన ధరణి పోర్టల్ తెచ్చింది. అనేక మాడ్యూళ్ల ద్వారా రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ తదితర ప్రక్రియలను సులభతరం చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఎవుసానికి 3 గంటల కరెంట్ సాలనీ, ధరణిని బంగాళఖాతంలో కలుపుతమని ఆగం చేస్తున్నారు. వారి విధానాలను తెలంగాణ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మమ్మల్ని పరేషాన్ చేస్తున్న కాంగ్రెస్సోళ్లకు బుద్ధి చెబుతమని ముక్తకంఠంతో తేల్చిచెబుతున్నారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు.

## కాంగ్రెస్‌తో నష్టమే తప్ప పైసా లాభం లేదు..



కాంగ్రెసోళ్లు 3గంటల కరంట్ ఇత్తం, రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలనడం సిగ్గు చేటు. తెలిసిన రైతెవరైనా గంత పెద్ద మోటర్ వాడుతడా.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరంట్ గోసలు చెప్పేటివి కాదు. రాత్రులు బాయిల కాడికి పోయి ఎంతో ఇబ్బందులు పడ్డం. కరంట్ సక్రమంగా లేక మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేటియి. కాంగ్రెస్ అంటేనే రైతులకు భయం వేస్తుంది. కేసీఆర్ సీఎం అయినంకనే ఎవుసానికి 24గంటలు కరంట్ ఉచితంగా ఇచ్చి ఆదుకుంటుండు. ఇది రైతులం ఎట్లా మరిచిపోతం. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కంటే ఏం మంచిగ జేత్తరని కాంగ్రెస్‌కు ఓటేస్తం. ఆ పార్టీతో నష్టమే తప్ప పైసా లాభం లేదు. మల్లా సీఎంగా కేసీఆర్ సారే ఉండాలని రైతులం కోరుకుంటున్నం. బీఆర్ఎస్‌కు ఓటేసి కేసీఆర్‌ను సీఎం చేసుకుంటం.

**- నూతుల మమత, రైతు ఇబ్రహీంపట్నం**

## నాటి బాధలు ఇంకా మర్చిపోలే..

కాంగ్రెస్ రాష్ట్రాన్ని 60 ఏండ్లు పాలించి రైతులకు చేసిందేమీ లేదు. నీళ్లు, కరెంట్ ఇయ్యక ముప్పు తిప్పలు పెట్టింది. నాటి బాధలు ఇంకా మర్చిపోలే.



కేసీఆర్ వచ్చిన తర్వాతనే 24 గంటల కరెంట్‌తో రంది లేకుంట బతుకుతున్నం. రెండు పంటలు పండించుకుటున్నం. 24 గంటలు ఎందుకు..? మూడు గంటలే ఇస్తామని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నరట..? వాళ్ల ఇంట్లకెళ్లి ఇస్తున్నరా..? మళ్లీ 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలని అంటున్నరట.. వాళ్లకు ఏమైనా తెలివి ఉందా..? వ్యవసాయ బావులకు 10హెచ్చ్‌పీ మోటర్లు పెడితే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మీద ఎక్కువ లోడ్‌పడి కాలిపోతయ్. తెలంగాణ రైతులు 10హెచ్‌పీ మోటర్ అస్సలే వాడరు. పెద్ద మోటర్ పెడితే ఫైప్‌లైన్లు మార్చాలి. కరెంట్ కూడ బాగా ఖర్చువుతుంది. మతి లేక మాట్లాడుతున్నరు. వాడూ వద్దు.. వాని కరెంట్ వద్దు.

**- ఏనుగు గంగారెడ్డి, రైతు అమ్మక్కపేట(ఇబ్రహీంపట్నం)**

## మీ భూమాత వద్దు.. మీ పాలన వద్దు



ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తే మళ్ల దళారులే రాజ్యమేలుతరు. దళారీ వ్యవస్థ మాకొద్దు.. తెలంగాణ ఏర్పడ్డాకనే రైతులు సంతోషంగా ఉంటున్నారు. పట్టాల కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగేటోళ్లం. ఇప్పుడు 10 నిమిషాల్లో పట్టాలు చేతికందుతున్నయ్. తహసిల్దార్ ఆఫీస్‌లోనే పట్టాలు చేయడంతో ఎక్కువ దూరం పోవాల్సిన అవసరం తప్పింది. కాంగ్రెస్ వస్తే ధరణిని తీసివేస్తామనడం సరికాదు. ఇప్పుడు ఎంతో ఈజీగా భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. కాంగ్రెస్ వస్తే మళ్లా ఆఫీసుల చుట్టు తిరుగుతూ ఉండాలే. మళ్లీ అధికారులకు లంచాలు ఇచ్చుకుంటనే ఉండాలే. అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు.

**- అలిశెట్టి మోహన్, రైతు ఇబ్రహీంపట్నం**

## పైరవీకారులు మళ్లా మొపైతరు..



మాది ఇబ్రహీంపట్నం. నాకు ఊళ్లే కొంత భూమి ఉంది. ధరణి పోర్టల్ తీసేయాలని కాంగ్రెస్ నాయకులు అనడం సరికాదు. ఈ పోర్టల్ వచ్చినంకనే భూములకు రక్షణ వచ్చింది. గతంలో అధికారులు ఇష్టం వచ్చినట్లు లంచం తీసుకుని భూములను ఒకరి పేరు నుంచి మరొకరి పేరుకు మార్చేవాళ్లు. ఇప్పుడు అలాంటిది ఏమీ లేదు. ఒకసారి భూమి రైతు పేరు ఉన్నదంటే ఎవరు మార్చలేరు. ధరణి వల్ల రైతులకు చాలా మేలు జరుగుతుంది. పట్టాదారు పాస్ పుస్తకాలు రావాలంటే చాలా ఏళ్లు పట్టేవి. అప్పుడు ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టు తిరిగేవాళ్లం. ఇప్పుడు ఇంటికే పట్టాదారు పాస్ పుస్తకాలు వస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన ధరణితో రైతులందరికి ఎంతో మేలు జరిగింది. ధరణిని తీసేస్తే పైరవీకారులు మళ్లా మొపైతరు. అప్పుడు రైతులు ఆగం కావాల్సి వత్తది..

**- తీగల రవీందర్‌రెడ్డి, రైతు ఇబ్రహీంపట్నం**

## పచ్చని తెలంగాణలో పల్లేర్లు మొలుస్తయి..



పిచ్చోళ్లని నమ్మితే పచ్చని తెలంగాణలో మళ్లీ పల్లేర్లు మొలుస్తయి. 24 గంటల కరెంటు పచ్చని పంటలు పండుతుంటే.. వ్యవసాయానికి మూడు గంటలు సరిపోతుందని పీసీసీ అధ్యక్షుడు పిచ్చోడిలెక్క ఒర్రుతుండు. 10 హెచ్‌పీల మోటర్‌తో ఎవరైనా వ్యవసాయం చేస్తరా.. ఒకవేళ చేసినా బోర్లళ్ల నీళ్లుంటయా.. ఇప్పుడున్న మోటర్లను ఏం జేయాలి? 10 హెచ్‌పీల మోటర్లు ఎవరు కొనియ్యాలి? ఇవన్నిటికీ రేవంత్ సమాధానం చెప్పాలి. తలాతోక లేని మాటలు మాట్లాడే కాంగ్రెసోళ్ల పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే తెలంగాణలో కరెంటు లేక పంటలు ఎండిపోయి పల్లేర్లు మొలుసుడు ఖాయం.

**- ముదాం తిరుపతిరెడ్డి, పెద్దాపూర్(మెట్‌పల్లి రూరల్)**

## ధరణితో రికార్డులు పదిలం.. రైతుకు ధైర్యం



సీఎం కేసీఆర్ తీసుకొచ్చిన ధరణితో భూ రికార్డులు పదిలంగా ఉంటయ్. ధరణి ఉన్నంత కాలం మా వ్యవసాయ భూములకు ఏమీ కాదన్నది రైతుల ధైర్యం. నా పేరున ఉన్న నాలుగు ఎకరాలు నా వేలిముద్ర లేకుండా రికార్డులు మార్చే అవకాశం లేదు. నేను అమ్మాలనుకుంటేనే నా అనుమతితోనే రికార్డులు మారుతాయి. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణి తీసివేస్తానంటుంది. ధరణి పోతే రైతుల బతుకులు ఆగమైతాయి. మళ్లీ మ్యుటేషన్ల కోసం రైతులు రెవెన్యూ అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. డబ్బులు ఇస్తే గాని పనులు జరుగవు. రైతును కష్టాల పాలు చేయాలనుకున్న కాంగ్రెస్‌కు ఆదిలోనే అడ్డుకట్ట వేయస్తాం.

**- పిట్టల శేఖర్, రైతు గొల్లపల్లి**

## 3 గంటల కరెంట్‌తో మళ్లీ పాత కథనే..



గతంల ఆరేడు గంటల కరెంట్ ఇత్తేనే రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఊర్కే బోర్లు, మోటార్లు కాలిపోవుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేది. రిపేర్ల కోసం అష్టకష్టాలు పడేది. ఇంక 3 గంటల కరెంట్ మాత్రమే రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటది. రైతులకు సరిపడా నాణ్యమైన విద్యుత్ ఇవ్వక పోతే ఇటు పంట దిగుబడి రాదు.. అటు పంట మంచిగా పండదు. దీంతో రైతు అనేక వ్యయ ప్రయాసాలకోర్చి కూడా ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితులుంటాయి. ప్రతీ రైతుకు సరిపడా విద్యుత్ ఉంటేనే ఏవుసాన్ని ఓ పండుగలా చేసుకునేందుకు వీలుంటుంది. 3 గంటల కరెంట్ మాత్రమే సరిపోతది అంటే అన్నోళ్లకు ఏవుసం అంటేనే తెలువదని నేను అనుకుంటున్నా.

**- గణవేని మల్లేశ్‌యాదవ్, రేగుంట, రైతు(మల్లాపూర్)**

## కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవు



కాంగ్రెస్ పార్టీని నమ్మితే రైతులకు కష్టాలు తప్పవు. రైతుల కష్టాలు చూసిన కేసీఆర్ 24 గంటల కరెంటు ఇస్తుండు. పంటలకు నీళ్లు పెట్టుకోవాలంటే ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవు. అదికూడా నాణ్యమైన విద్యుత్ కావడంతో మోటర్లు కూడా కాలిపోతలేవు. రైతులు మంచిగా బతుకుడు ఇష్టం లేకనే పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంటు సరిపోతుందంటున్నడు. కాంగ్రెస్ పార్టీని రైతులు నమ్మితే కరెంటు ఉండదు.. కష్టాలే మిగులుతయి. అవగాహన లేకుండా మూడు గంటలు, 10 హెచ్‌పీల మోటర్ అంటూ పిచ్చికూతలు కూస్తున్న రేవంత్‌కు రైతులు బుద్ధి చెప్పాలే.

**- చేపూరి శేఖర్‌రెడ్డి, పెద్దాపూర్(మెట్‌పల్లి రూరల్)**

## రేవంత్‌రెడ్డికి పిచ్చిపట్టింది



సీఎం కేసీఆర్ పాలనల రైతులం మంచిగ పంటలు పండించుకుంటున్నం. నీళ్ల గోస లేదు.. కరెంటు కష్టాలు అస్సలే లేవు. రంది లేకుండా పంటలకు ఎప్పుడు పడితే అప్పుడు నీళ్ల పారకం చేస్తున్నం. కానీ వ్యవసాయానికి మూడు గంటలు కరెంటు సరిపోతుందని చెబుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి పిచ్చిపట్టింది కావచ్చు. లేకపోతే మూడు గంటల్లో నీళ్ల పారకం సరిపోతుందా. పదెకరాల రైతుకు మూడు గంటల కరెంటు ఇస్తే ఎన్ని ఎకరాలకు నీళ్లు అందుతయో..? రేవంత్‌రెడ్డే చెప్పాలి. 10 హెచ్‌పీల మోటర్లు ఎన్ని పెట్టాలి. ఇవన్నీ ఎవడు కొనియ్యాలి. ముందు వెనకా ఆలోచించకుండా మాట్లాడుతున్న రేవంత్‌ను పిచ్చాసుపత్రిలో చేర్చాలి.

**- కొమ్ముల రమేశ్‌రెడ్డి, పెద్దాపూర్(మెట్‌పల్లి రూరల్)**